సాక్షి
రంగారెడ్డి
సోమవారం । 1 । సెప్టెంబర్ । 2025



భాగ్యమెవరికో!

గణేశ్ నవరాత్రోత్సవాలకు హైదరాబాద్ ప్రసిద్ధి. ఏటా నిర్వహించే సంబరాలకు నగరమంతా ఉప్పొంగుతోంది. 8లో ▸



విసర్జన్.. ఆన్‌లైన్!

సిటీలో ఏటా జరిగే గణేశ్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనం నగర పోలీసులకు అత్యంత కీలకమైన ఘట్టాలు. 8లో ▸



పదేళ్లుగా తిప్ప

ఏళ్ల నుంచి పనిచేస్తున్న కొంతమంది సిబ్బంది ఆర్టీఏ సేవలను ప్రభావితం చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. 8లో ▸

న్యూస్‌రీల్

రాష్ట్రస్థాయి పోటీల్లో శంకర్‌పల్లి యువకుడి సత్తా



మెడల్ అందుకుంటున్న వరుణ్ గౌడ్

శంకర్‌పల్లి: డిస్కస్ త్రో, షాట్‌పుట్ పోటీల్లో మండల పరిధిలోని కొండకల్ గ్రామానికి వరుణ్ గౌడ్ సత్తా చాటాడు. రెండు రోజుల క్రితం మహబూబ్‌నగర్ జిల్లా పాలమూరు వర్సిటీలో ప్రారంభమైన 11వ తెలంగాణ రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్–2025 పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. అండర్–18 డిస్కస్ త్రో, షాట్‌పుట్ పోటీల్లో వరుణ్‌గౌడ్ సత్తా చాటి, రెండింటిలోనూ ద్వితీయ స్థానంలో నిలిచాడు. బాసర ట్రిపుల్ ఐటీలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న వరుణ్ గౌడ్ విజయాలపై తల్లిదండ్రులు కల్పన, లక్ష్మణ్ హర్షం వ్యక్తం చేశారు.

నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

ఎంపీడీఓ బన్సీలాల్



బొబ్బిలి చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, నాయకులు

షాద్‌నగర్: వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని ఎంపీడీఓ బన్సీలాల్ అన్నారు. ఆదివారం ఆయన పట్టణ శివారులో బొబ్బిలి చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, ఎస్ఐ రాంచంద్రయ్యతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఇప్పటికే నిమజ్జనానికి రూట్ మ్యాప్‌ను సిద్ధం చేశామన్నారు. చెరువు వద్ద ప్రత్యేకమైన క్రేన్‌లు, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడంతో పాటుగా, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచామని చెప్పారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్ శ్రీశైలంగౌడ్, మున్సిపల్ సిబ్బంది అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

సదుపాయాల కల్పనలో విఫలం

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి




చిరువ్యాపారులతో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

చేవెళ్ల: రైతు బజార్‌లో కూరగాయలు విక్రయించే చిరు వ్యాపారులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి మార్కెట్ కమిటీని డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి మండల కేంద్రంలోని రైతు బజార్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా చిరువ్యాపారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రోడ్డుపక్కన చిరువ్యాపారులను రైతు బజారుకు తరలించిన మున్సిపల్, పోలీస్ అధికారులు సౌకర్యాల కల్పనలో విఫలమయ్యారన్నారు. తాగునీటి వసతి, టాయిలెట్స్, వీధి దీపాలు లేక ఇబ్బంది పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే చిరువ్యాపారులు, రైతులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభులింగం, సత్యనారాయణ, సత్తిరెడ్డి, కృష్ణ తదితరులు ఉన్నారు.

మహాగణపతికి కిషన్‌రెడ్డి ప్రత్యేక పూజలు

ఖైరతాబాద్: ఖైరతాబాద్‌లో కొలువు దీరిన శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతిని ఆదివారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి దర్శించుకున్నారు. ఖైరతాబాద్ డివిజన్ బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 26 కిలోల లడ్డూను కేంద్ర మంత్రి స్వయంగా తలపై పెట్టుకొని మహాగణపతికి సమర్పించారు. అనంతరం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ స్వదేశీ టెక్నాలజీతో ఆపరేషన్ సిందూర్‌తో విజయం సాధించామని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ఆదర్శ్, రాంమ్మోహన్‌రావు, వీణామాధురి పాల్గొన్నారు.

తప్పుల తడక.. ఓటర్ల జాబితా!



ఒకే వ్యక్తికి మూడు ఓట్లు

- ఒకే వ్యక్తికి మూడు ఓట్లు.. వేర్వేరు ఫొటోలు
- 3,624 అభ్యంతరాలు స్వీకరణ
- మార్పులు చేర్పులపై 37 ఫిర్యాదులు
- రేపు తుది జాబితా

సాక్షి, రంగారెడ్డిజిల్లా: స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ల జాబితా తప్పుల తడకగా మారింది. క్షేత్రస్థాయిలోని ఓటర్లకు.. జాబితాలో ఉన్న పేర్లకు సంబంధం లేకుండా పోయింది. మూడు రోజుల క్రితం ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రకటించిన జాబితాను చూసి స్థానిక ఓటర్లు ఆశ్చర్యపోయారు. ఒక్కో వ్యక్తికి రెండు మూడు ఓట్లు ఉన్నట్లు తేలగా, మరికొంత మంది పేర్లలో తప్పులు దొర్లాయి. ఒకరి ఫొటోకు బదులు మరొకరి ఫొటోలు వచ్చాయి. ఒక వార్డులో ఉండాల్సిన ఓటర్ల పేర్లు మరో వార్డులో కన్పించాయి. మృతుల పేర్లతో పాటు ఏళ్ల క్రితమే ఊరు వదిలి వెళ్లిన వారి పేర్లు సైతం జాబితాలో దర్శనమిచ్చాయి. పోలింగ్ కేంద్రాల ఎంపిక గందరగోళంగా మారింది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సమయంలో వెల్లడించిన జాబితాలో చిన్న చిన్న మార్పులు, చేర్పులు చేసి ప్రకటించారు. ఈ జాబితాపై జిల్లా వ్యాప్తంగా 3,624 అభ్యంతరాలు వ్యక్తమవగా పేర్లు మార్పులు, చేర్పులకు సంబంధించి మరో 37 ఫిర్యాదులు అందాయి. ఆయా అభ్యంతరాలను జిల్లా అధికారులు పరిగణలోకి తీసుకుని జాబితాలో మార్పులు చేర్పులు చేపట్టారు.

అభ్యంతరాలకు పరిష్కారం

యాచారంలో అత్యధికంగా 319 అభ్యంతరాలు వ్యక్తం కాగా, శంషాబాద్‌లో 305, మహేశ్వరంలో



ఒకే మహిళకు రెండు ఓట్లు

265, ఫరూక్‌నగర్‌లో 260, కొందుర్గులో 229, ఆమనగల్‌లో 225, చౌదరిగూడలో 215, కందుకూరులో 202, కడ్తాల్ 165, కేశంపేట 140, శంకర్‌పల్లిలో 139, మాడ్గుల 124, తలకొండపల్లిలో 127, మంచాలలో 115, చేవెళ్ల 110, అబ్దుల్లాపూర్ మెట్‌లో 102, నందిగామ 99, ఇబ్రహీంపట్నం 85, షాబాద్ 78, కొత్తూరు 66 చొప్పున అభ్యంతరాలు వ్యక్త మయ్యాయి. వీటిలో మెజార్టీ ఫిర్యాదులు బోగస్ ఓట్లు, చనిపోయిన వారి పేర్ల తొలగింపు, ఒక వార్డులో ఉండాల్సిన వారి పేర్లు మరో వార్డులో కన్పించడం, పేరు, ఇంటి పేరులో దొర్లిన తప్పుల సవరణకు సంబంధించినవి ఉన్నవి. స్థానికుల నుంచి అందిన ఈ అభ్యంతరాలను సంబంధిత ఆర్డీఓలకు నివేదించి దిద్దుబాటు చర్యలను చేపట్టారు. సోమవారంలోగా ఆయా అభ్యంతరాలన్నీ పరిష్కారం కానున్నాయి. మంగళవారం సాయంత్రం లోగా తుది జాబితా వెల్లడించనున్నారు.

21 జెడ్పీటీసీ.. 230 ఎంపీటీసీ స్థానాలు

జిల్లాలో 27 మండలాలు ఉండగా, వీటి పరిధిలో 15 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లు ఉన్నాయి. 21 జెడ్పీటీసీ స్థానాలతో పాటు 230 ఎంపీటీసీ స్థానాలు ఖరారు చేసింది. 2019 ఎన్నికల్లో 257 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, కొత్తగా మొయినాబాద్, చేవెళ్ల మున్సిపాలిటీలు ఏర్పాటు చేయడం , గ్రేటర్ సమీపంలోని పలు గ్రామాలను ఆయా మున్సిపాలిటీల్లో విలీనం చేయడంతో 27 ఎంపీటీసీ స్థానాలను కోల్పోవాల్సి వచ్చింది. 558 గ్రామ పంచాయతీలుండగా, 32 స్థానాలను కోల్పోయి ప్రస్తుతం 526కు పరిమితమైంది. ఆయా గ్రామ పంచాయతీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల పరిధిలో మొత్తం 7,94,653 మంది ఓటర్లు ఉన్నారు.

'స్థానిక'స్వరూపం ఇలా

గ్రామ పంచాయతీలు	526
వార్డులు	4,668
పోలింగ్ కేంద్రాలు	4,682
మొత్తం ఓటర్లు	7,94,653
పురుషులు	3,99,404
మహిళలు	3,95,216
ఇతర ఓటర్లు	33
ముద్రించిన బ్యాలెట్ పేపర్లు	
సుమారు	10లక్షలు
ఎంపీటీసీ స్థానాలు	230
జెడ్పీటీసీ స్థానాలు	21

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ముసాయిదా వెల్లడి

తాజాగా ఎన్నికల కమిషన్ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ముసాయిదా ప్రకటన సైతం జారీ చేసింది. ఈ నెల 6న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రకటన, 8న అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం, అభ్యంతరాల స్వీకరణ, 10న తుది జాబితాను వెల్లడించనుంది. అయితే గ్రామ పంచాయతీ ఎన్నికలు ముందు నిర్వహిస్తారా? లేక ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు ముందు నిర్వహిస్తారా? అనే అంశంపై ఇప్పటికీ ఓ స్పష్టత లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

ఏకదంతం.. మహాకాయం..



ఖైరతాబాద్ మహా గణపతిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆదివారం సెలవు రోజు కావడంతో ఆ ప్రాంతం భక్త జనసందోహంగా మారింది. సాయంత్రం చిరుజల్లులు కురిసినా భక్తులు తడుస్తూనే వినాయకుడిని దర్శించుకున్నారు. ఒక్కరోజే దాదాపు 5 లక్షల మంది భక్తులు దర్శించుకున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు.

– సాక్షి, సిటీబ్యూరో







అంబేడ్కర్ వర్సిటీ డిగ్రీ, పీజీ ప్రవేశ గడువు పెంపు

సెప్టెంబర్ 12 వరకు అవకాశం

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ డిగ్రీ , పీజీ కోర్సులు, బ్యాచిలర్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, మాస్టర్ లైఫ్ సైన్సెస్, డిప్లొమా వంటి సర్టిఫికెట్ కోర్సుల్లో 2025–26 విద్యా సంవత్సరానికి ప్రవేశ గడువు సెప్టెంబర్ 12 వరకు పొడిగించినట్లు విశ్వవిద్యాలయ విద్యార్థి సేవల విభాగ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వర్సిటీలో 2023–24, 2024–25 విద్యా సంవత్సరాల్లో డిగ్రీలో చేరిన ద్వితీయ, తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు లేదా అంతకముందు చేరిన డిగ్రీ/పీజీ విద్యార్థులు సకాలంలో ఫీజు చెల్లించలేకపోయిన వారు కూడా సెప్టెంబర్ 12లోపు ట్యూషన్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలని సూచించారు. 2016 నుంచి 2025 విద్యా సంవత్సరాల్లో ఆయా కోర్సుల్ల చేరి సకాలంలో ట్యూషన్ ఫీజు చెల్లించలేకపోయిన వారు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సెప్టెంబర్ 12, 2025 తేదీ లోపు నెట్ బ్యాంకింగ్, క్రెడిట్, డెబిట్ కార్డు లేదా ఆన్‌లైన్ సెంటర్ల ద్వారా ట్యూషన్ ఫీజు చెల్లించాలన్నారు.



రాజగోపాల్‌గౌడ్‌ను సన్మానిస్తున్న బీజేపీ శ్రేణులు

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్‌గౌడ్

కేశంపేట: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్ గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని కొత్తపేట, కేశంపేట గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కొత్తపేటలో ఇటీవల శస్త్రచికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న పార్టీ సీనియర్ నాయకుడు లెంకపోతుల విఠల్‌గౌడ్‌ను పరామర్శించారు. అనంతరం కేశంపేటలో మైసమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంరతం గాంధీ చౌరస్తా సమీపంలో ఏకదంత యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పవన్‌కుమార్‌రెడ్డి నివాసంలో కార్యకర్తల సమావేశంమై మాట్లాడారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. నాయకులు, కార్యకర్తలు సంయుక్తంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షురాలు రాధిక, స్థానిక సంస్థల మండల కన్వీనర్ మహేశ్, మాజీ వైస్ ఎంపీపీ నర్సింహ యాదవ్, శ్రీనివాసులు, రఘురాములు గౌడ్, శ్రీనివాస్, పవన్‌కుమార్‌రెడ్డి, యుగేందర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ @రూ.11లక్షలు



తుక్కుగూడ: లడ్డూతో శ్రీనివాస్‌రెడ్డి

తుక్కుగూడ: మున్సిపల్ పరిధిలోని వినాయక ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం గార్డెనియా గ్రోవ్ విల్లాస్, రాంకీ డిస్కవరీ సిటీ శ్రీనగర్‌లో ఉత్సవ కమిటీ సభ్యులు గణపతి లడ్డూ వేలం నిర్వహించారు. ఈ వేలంలో సిటీకి చెందిన రాజుల శ్రీనివాస్‌రెడ్డి దంపతులు రూ.11,33,132 దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సుభాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: లడ్డూను కైవసం చేసుకున్న వినయ్‌కుమార్

షాద్‌నగర్‌లో రూ.8లక్షలు

షాద్‌నగర్: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా షాద్‌నగర్ పట్టణంలోని అమిగో అర్బన్ అపార్టుమెంట్‌లో ఏర్పాటు చేసిన గణేష్‌ను ఆదివారం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలంలో పట్టణానికి చెందిన వినయ్‌కుమార్ రూ.8లక్షలకు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు అందె మోహన్, సంతోశ్ కుమార్, సురేష్‌రెడ్డి, హరినాయక్, రవికుమార్ వినయ్‌కుమార్‌ను సత్కరించారు.

దండుమైలారంలో దారుణం

- 11 గుంటల భూమి కోసం నాలుగేళ్లుగా అన్నదమ్ముల కొట్లాట
- ఆదివారం కత్తులు, గొడ్డళ్లతో దాడులకు దిగిన వారసులు
- ఒకరి మృతి.. చావుబతుకుల మధ్య మహిళ
- పలువురికి గాయాలు



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు





చికిత్స పొందుతున్న క్షతగాత్రులు వెంకటరాజు, పర్వతాలు

ఇబ్రహీంపట్నం: భూ వివాదం ఒకరి ప్రాణాలు తీయగా.. మరో మహిళ చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. ఈ ఘటన ఇబ్రహీంపట్నం ఠాణా పరిధిలోని దండుమైలారం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. ఏసీపీ కేపీవీ రాజు, సీఐ మహేందర్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన గుడేటి జంగయ్యకు 156, 158, 159 సర్వే నంబర్లలో 18.12 ఎకరాల భూమి ఉంది. నాలుగేళ్ల క్రితం జంగయ్య ఆయన నలుగురు కుమారులైన నర్సింహ, యాదయ్యకు 4.28 ఎకరాలు, మల్లయ్యకు 4.17 ఎకరాలు, జంగయ్యకు 4.18 ఎకరాల చొప్పున భూమిని పంచారు. మల్లయ్య, జంగయ్యలకు 11 గుంటల భూమి తక్కువగా రావడంతో నాటి నుంచి ఈ భూ పంచాయితీ కొనసాగుతూ వస్తోంది. పోలీస్‌స్టేషన్‌లోనూ ఇరువర్గాల వారు ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ క్రమంలో ఆర్డీఓ సదరు వివాదాస్పద భూమిలోకి ఎవరూ వెళ్లొద్దని 145 ఆర్డర్ జారీ చేశారు. కాగా ఆదివారం నాట్లు వేస్తున్నట్లు తెలుసుకున్న మల్లయ్య, జంగయ్య వారసులు బాల్‌రాజ్(బాలయ్య), ధన్‌రాజ్, వెంకటరాజ్, పర్వతాలు, పావని, మంజుల అడ్డుకునేందుకు యత్నించారు. దీంతో నర్సింహ, యాదయ్య వారసులు బాలరాజు, శ్రీశైలం, లింగస్వామి, యాదయ్య, ప్రసాద్, పద్మ, హర్షిత, పారిజాత తదితరులు గొడ్డళ్లు, కత్తులతో దాడికి దిగారు. బాల్‌రాజ్‌పై గొడ్డలితో దాడి చేస్తున్న క్రమంలో అతని మరదలు(తమ్ముడి భార్య) అడ్డుకునేందుకు యతి్నంచగా ఇరువురిపై వేటు వేశారు. బాల్‌రాజ్‌ను ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మంజుల తీవ్ర గాయాలతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. మరో నలుగురు క్షతగాత్రులు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వైరి వర్గానికి చెందిన బాలరాజ్, శ్రీశైలం లింగస్వామి, యాదయ్య, పారిజాత సైతం గాయాలతో చికిత్స పొందుతున్నట్లు తెలుస్తోంది. కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

సోమవారం అంత్యక్రియలు



బాల్‌రాజ్ మృతదేహం



బాల్‌రాజ్(ఫైల్)

దండుమైలారం గ్రామ శివారు గొడ్డళ్లు, కత్తుల దాడితో రకసిక్తమయ్యాయి. ఉదయం 8 గంటల ప్రాంతంలో అరుపులు, కేకలతో రణరంగాన్ని తలపించాయి. నాలుగేళ్లుగా కొనసాగుతున్న భూ పంచాయితీ ప్రాణాలు బలి తీసుకుంటుందని ఎవరూ ఊహించలేకపోయారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పెద్ద ఎత్తున ఘటనాస్థలికి చేరుకున్నారు. కుమారుడిని పోగొట్టుకున్న తండ్రి మల్లయ్య కుమిలిపోతుండడంతో చూసి గ్రామస్తులు కంటతడిపెట్టారు. మృతుడు బాల్‌రాజ్‌కు ముగ్గురు పిల్లలుండగా.. తీవ్రంగా గాయపడిన మంజులకు ఇద్దరు పిల్లలతో పాటు ఆరు నెలల కుమారుడున్నారు. బాల్‌రాజ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. సోమవారం పోస్టుమార్టం అనంతరం అంత్యక్రియలు జరగనున్నాయి. ఈ మేరకు పోలీసులు గ్రామంలో పటిష్టబందోబస్తు ఏర్పాటు చేశారు. ఆస్పత్రుల వద్ద పోలీస్ పహారా ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్ నేత ప్రోద్బలంతోనే..

నియోజకవర్గానికి చెందిన ఓ కాంగ్రెస్ నేత ప్రోద్బలంతోనే ఈ దారుణం జరిగిందని మృతుడు బాల్‌రాజ్ సోదరుడు ధన్‌రాజ్ ఆరోపించారు. ఈ భూవివాదం సమసిపోకుండా ఆ నేతనే అడ్డుపడ్డాడని అతనిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఆర్టీఏలో ఏళ్లకు ఏళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న కొంతమంది సిబ్బంది రవాణాశాఖ పౌరసేవలను ప్రభావితం చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులపైన కూడా పెత్తనం కొనసాగిస్తూ దళారులు, ఏజెంట్లకు అండగా నిలుస్తున్నారు. అక్రమార్జనే ధ్యేయంగా స్మార్ట్ కార్డుల అమ్మకాలు, సామర్థ్యం లేని వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ వంటి అక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు. సాధారణంగా ప్రతి మూడేళ్లకు ఒకసారి ఒకచోట నుంచి మరోచోటుకు బదిలీ కావాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా కొందరు కానిస్టేబుళ్లు, హోంగార్డులు, ఇతర విభాగాలకు చెందిన ఉద్యోగులు ఏడేళ్ల నుంచి పదేళ్లకు పైగా ఒకే కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో ఆయా కార్యాలయాల్లో జరిగే అన్ని రకాల కార్యకలాపాల్లో హవా కొనసాగిస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో పలు ప్రాంతీయ రవాణా కార్యాయాల్లో కొంతమంది సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. –సాక్షి, సిటీబ్యూరో

పదేళ్లుగా.. తిష్ట

ఆర్టీఏ విధుల్లో వారిదే పెత్తనం

దళారులు, ఏజెంట్లతో కుమ్మక్కు

- ఆర్టీఏలో ఒకేచోట పాతుకుపోయిన సిబ్బంది
- కొన్నిచోట్ల హోంగార్డులదే హవా

స్మార్ట్‌కార్డుల అమ్మకాలు, ఫిట్‌నెస్ లేని వాహనాలకు అనుమతులు

సాధారణంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహనాల రిజిస్ట్రేషన్ల స్మార్ట్ కార్డులను వాహనదారులకు స్పీడ్‌పోస్టు ద్వారా అందజేసేందుకు రవాణాశాఖ చర్యలు తీసుకుంది. కానీ కొంతమంది సిబ్బంది ఈ కార్డులపై చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. వాహనదారులకు పోస్టు చేయకుండా తమ వద్దే ఉంచుకొని దళారుల ద్వారా రూ.200 నుంచి రూ.300లకు ఒక కార్డు చొప్పున వాహన యజమానులకు విక్రయిస్తున్నారు. కొన్ని ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లో ఈ అమ్మకాలు వ్యవస్థీకృతమైన దందాగా కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మోటారు వాహన నిబంధనల అమలుపైన అధికారులు నిర్వహించే ఎన్‌ఫోర్స్‌మెంట్ విధుల్లోనూ కానిస్టేబుళ్లే ముందు వరుసలో ఉంటారు. పర్మిట్లు లేని వాహనాలు, ఫీజులు చెల్లించని వారి నుంచి వసూళ్లకు పాల్పడుతూ సదరు వాహనాలు అధికారులకు చిక్కకుండా ముందస్తు సమాచారం ఇస్తున్నట్లు కొందరు ఎంవీఐలే విస్మయం వ్యక్తం చేయడం గమనార్హం. ఓవర్‌లోడ్ వాహనాలు, వివిధ రకాల నిబంధనలను ఉల్లంఘించి తిరిగే వాటిని ఇలా తప్పించడం వల్ల రవాణాశాఖకు రావాల్సిన ఆదాయానికి గండి పడుతున్నట్లు పేర్కొన్నారు.

కదిలించడం కష్టమే..

ఇలా సుమారు దశాబ్దకాలంగా ఒకేచోట పని చేస్తున్న సిబ్బంది తమను బదిలీ చేయకుండా రాజకీయ పలుకుబడిని అస్త్రంగా వాడుకుంటున్నారు. అధికార పార్టీకి చెందిన నేతలు తమకు మద్దతుగా ఉన్నట్లు ఉన్నతాధికారులపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. విధి నిర్వహణలోనూ అధికార పార్టీని సాకుగా చూపుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి వారిని బదిలీ చేసేందుకు అధికారులు సైతం వెనుకడుగు వేస్తున్నారు. తాము ఫలానా పెద్ద నాయకుడికి చెందిన అనుచరులమని చెబుతారు. దీంతో వాళ్ల జోలికి వెళ్లడానికి కూడా అధికారులు సాహసించడం లేదు. వివిధ ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది బదిలీలు యదావిధిగా జరిగినప్పటికీ కొంతమంది మాత్రం తమ పలుకుబడిని ఉపయోగించి బదిలీలను అడ్డుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



బాలాపూర్.. భాగ్యమెవరికో!



మండపం వెలుగులు

నగరంలో గణేశ్ లడ్డూకి భలే క్రేజ్

- వేలంలో దక్కించుకునేందుకు పోటీపడుతున్న భక్తులు
- లడ్డూతో పాటు వెండి పళ్లెం బహూకరణ

బడంగ్‌పేట్: గణేశ్ నవరాత్రోత్సవాలకు హైదరాబాద్ మహానగరం ప్రసిద్ధి. ఏటా నిర్వహించే గణనాథుడి సంబరాలకు నగరమంతా ఉప్పొంగుతోంది. అందులో శివారు ప్రాంతంలోని బాలాపూర్ వినాయకుడి ప్రాధాన్యం గురించి చెప్పనక్కర్లేదు. అంతగా క్రేజ్ ఉంటుంది. మరీ ముఖ్యంగా లడ్డూ వేలంతో ఖ్యాతి ఖండాంతరాలు దాటింది. కోరిన కోర్కెలు తీర్చే భగవంతుడి ప్రసాదంగా భక్తుల విశ్వాసం చూరగొనడంతో లడ్డూను కైవసం చేసుకునేందుకు భక్తులు పోటీ పడుతుంటారు.

ప్రత్యేకత

నవరాత్రులు పూజలందుకున్న బాలాపూర్ గణేశుడి భారీ లడ్డూను దక్కించుకునేందుకు భక్తులు ఏటా రూ.లక్షలు వెచ్చించి వేలంలో పోటీ పడుతుంటారు. ప్రసాదం సొంతం చేసుకున్న వారు.. తమ పంటపొలాలు, వ్యాపార సంస్థలు, కార్యాలయాల్లో చల్లి అధిక దిగుబడులు, రాబడులు అందుకోవడమే కాకుండా వ్యాపారంలో గతం కంటే మరింత లాభాలు ఆర్జిస్తున్నట్లు లడ్డూను కొనుగోలు చేసిన భక్తులు పేర్కొంటున్నారు.



కొలువైన గణనాథుడు

21 కిలోల లడ్డూ

ఆంధ్రా ప్రాంతానికి చెందిన తాపేశ్వరం మిఠాయి తయారీదారులు లడ్డూను తయారు చేస్తున్నారు. నాణ్యత, సైజు(21 కిలోలు) విషయాల్లో నాటి నుంచి నేటి వరకు ఎలాంటి తేడా లేనప్పటికీ.. లడ్డూను ఉంచేందుకు 2 కిలోల వెండి గిన్నెను, వేలంలో లడ్డూ దక్కించుకున్న వారికి ఇస్తున్నట్లు హనీ ఫుడ్స్ తయారీదారుడు ఉమామహేశ్వర్ తెలిపారు.

1980లో మొదలై..

46 ఏళ్లుగా బాలాపూర్ లడ్డూ చరిత్ర సృష్టిస్తోంది. 1994లో కొలన్ మోహన్‌రెడ్డి రూ.450తో ప్రారంభించిన వేలం పాట.. నిర్విరామంగా కొనసాగుతోంది. 2024లో రూ.30 లక్షలకు పలికి రికార్డు చేరుకుంది. ఈ సారి ఎంత ధర పలుకుతుందో అని అందరూ వేచి చూస్తున్నారు. వేలంలో వచ్చిన నగదును వివిధ ఆలయాల నిర్మాణం, పాఠశాలల అభివృద్ధి, ప్రజాసేవ తదితర కార్యక్రమాలకు వినియోగిస్తారని నిర్వాహకులు పేర్కొన్నారు.

పటిష్ట బందోబస్తు

భారీ సైజులో ఉండే బాలాపూర్ గణనాథుడి నిమజ్జనానికి తరలించేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తారు. పాతబస్తీ, బార్కస్, చాంద్రాయణ్‌గుట్ట, అలియాబాద్, చార్మినార్, ముస్లింబస్తీలు, కాలనీల మీదుగా ఊరేగి హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం అవుతుంది. ఈ విగ్రహాన్ని కదిలించిన తర్వాతే నగరంలోని మిగతా పెద్ద గణనాథులను తరలించే సంప్రదాయం కొనసాగుతోంది.

గతంలో లడ్డూను దక్కించుకున్నవారు

పేరు	సంవత్సరం	రూపాయల్లో
కొలన్ మోహన్‌రెడ్డి	1994	450
కొలన్ మోహన్‌రెడ్డి	1995	4,500
కొలన్ కృష్ణారెడ్డి	1996	18,000
రమేశ్‌యాదవ్, శశాంక్‌రెడ్డి	2021	18.90 లక్షలు
వంగేటి లక్ష్మారెడ్డి	2022	24.60 లక్షలు
దాసరి దయానందరెడ్డి	2023	27 లక్షలు
కొలన్ శంకర్‌రెడ్డి	2024	30 లక్షలు

అన్ని వసతులు కల్పించాం



ఈసారి గణనాథుడి మండపాన్ని స్వర్ణగిరి వేంకటేశ్వరస్వామి ఆలయ నమూనాలో ఏర్పాటు చేశాం. వినాయకుడి తలపై శివుడు, నాగ పడగలు, సింహంపై కూర్చునట్లుగా స్వామివారు దర్శనం ఇస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని వసతులను కల్పిస్తున్నాం. మండపం చుట్టూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. వీఐపీల దర్శనాలకు పోలీసులు సహకరిస్తున్నారు.

– కళ్లెం నిరంజన్‌రెడ్డి, బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు

కొత్త నిబంధన



వినాయకుడి చేతిలో లడ్డూ

లడ్డూ వేలంలో పాల్గొనే వారికి ఈసారి ఉత్సవ కమిటీ నిర్వాహకులు కొత్త నిబంధన అమలు చేస్తున్నారు. గతంలో వేలానికి ముందుగా రూ.5 వేలు చెల్లించి పేర్లు నమోదు చేసుకునేవారు. మారిన నిబంధన ప్రకారం గతేడాది రూ.30 లక్షలకు లడ్డూ చేరుకుంది కనుక ఈసారి రూ.20 లక్షలు ముందుగానే చెల్లించాలని షరతు పెట్టారు. అయినప్పటికీ భారీగానే ఆశావహులు డబ్బులు చెల్లించి పేర్లు నమోదు చేసుకుంటున్నారు.

బిర్యానీలో బొద్దింక!

మొయినాబాద్: చికెన్ బిర్యానీ తినడానికి హోటల్‌కు వెళ్లిన ఓ వ్యక్తికి చేదు అనుభవం ఎదురైంది. బిర్యానీలో బొద్దింక రావడంతో కంగారుపడ్డాడు. ఈ సంఘటన మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్‌నగర్ ఓ హోటల్‌లో వెలుగుచూసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అజీజ్ నగర్‌కు చెందిన సత్యనారాయణ హిమాయత్‌నగర్ రెవెన్యూలో ఉన్న ఓ హోటల్లో బిర్యానీ తినడానికి వెళ్లాడు. చికెన్ బిర్యాని ఆర్డర్ చేయడంతో తెచ్చిపెట్టారు. బిర్యానీ తిండుండగా అందులో బొద్దింక కనిపించింది. వెంటనే నిర్వాహకులకు చూపించి ప్రశ్నించగా తమకేమి తెలియదన్నట్లు సమాధానమిచ్చారు.



బిర్యానీలో వచ్చిన బొద్దింక

బాధితుడు ఫొటో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. ఈ హోటల్లో గతంలోనూ బిర్యానీలో ఈగలు, పురుగులు వచ్చిన సంఘటనలు జరిగాయి. ఫుడ్ సేఫ్టీ, క్వాలిటీ కంట్రోల్ అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో ఇలాంటి ఘటనలు వెలుగుచూస్తున్నాయని.. అధికారులు స్పందించి ఇలాంటి హోటళ్లను సీజ్ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పరిశుభ్రతలో కార్మికులే కీలకం

తాండూరు టౌన్: పట్టణాన్ని పరిశుభ్రంగా మార్చడంలో కార్మికులదే కీలక పాత్ర అని మున్సిపల్ కమిషనర్ యాదగిరి అన్నారు. ఆదివారం మున్సిపల్ కార్మికుల గుర్తింపులో భాగంగా వారికి జాకెట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు వార్డుల్లో పేరుకు పోయిన చెత్తను విధిగా నిత్యం తొలగించాలన్నారు. చెత్త తరలింపుపై మున్సిపల్ జవాన్లు ఎప్పటికప్పుడూ వాకబు చేస్తుండాలన్నారు. ప్రజలు కార్మికులను సులభంగా గుర్తించేందుకు వారికి జాకెట్స్ అందజేసినట్లు చెప్పారు. మున్సిపల్ డీఈ మణిపాల్, ఏఈ ఖాజాహుస్సేన్, మేనేజర్ నరేందర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, జవాన్లు పాల్గొన్నారు.



కార్మికులకు జాకెట్స్ పంపిణీ చేస్తున్న కమిషనర్

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

చాంద్రాయణగుట్ట: వినాయక ఉత్సవాలకు సంబంధించిన బ్యానర్ సరిచేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..జంగమ్మెట్, రవీంద్రనాయక్ కాలనీకి చెందిన భరత్(33) ఆటోడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. స్థానిక హనుమాన్ దేవాలయంలో గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం బంజారా హోటల్ వద్ద ఏర్పాటు చేసిన బ్యానర్ కిందికి జరిగినట్లు కనిపించడంతో భరత్ దానిని సరి చేస్తుండగా కరెంట్ షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

ఏడీఈ కార్యాలయం ఎదుట ధర్నా

బస్తీకి యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న స్థానికులు ఫలక్‌నుమా ఏడీఈ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. కరెంటు తీగల సమస్యపై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోనందునే ఈ ప్రమాదం చోటు చేసుకుందని ఆరోపించారు. మృతుడి కుటుంబ సభ్యులకు రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ డిమాండ్ చేశారు.

ఘనంగా శ్రీరాధాష్టమి వేడుకలు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో ఆదివారం శ్రీరాధాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ భగవానుని నిత్య సఖీమణి రాధారాణి దివ్య ఆవిర్భావ తిథి సందర్భంగా నగరంలోని అనేక మంది భక్తులు ఆలయాన్ని సందర్శించి స్వామి వార్ల ఆశీస్సులు పొందారు. రాధాగోవిందులు ప్రత్యేక అలకారంలో భక్తు లకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామి వారికి చప్పన్ భోగ్ (56 విశేషమైన ఆహార పదార్థాలతో కూడిన నైవేద్యం) సమర్పించారు. ఈ సందర్భంగా హరేకృష్ణ మూవ్‌మెంట్ హైదరాబాద్ అధ్యక్షులు సత్యగౌర చంద్రదాస ప్రభూజీ రాధాష్టమి ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. రాధారాణి సమస్త జగత్తుకూ తల్లి వంటిదని, ఈ పవిత్రమైన రోజున భక్తులంతా తమమకు కృష్ణభక్తిని ప్రసాదించమని ఆ తల్లిని ప్రార్థిస్తారని వివరించారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

దుద్యాల్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెరువు కట్ట కిందకు దూసుకెళ్లడంతో ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన మండల కేంద్రం సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని అల్లిఖాన్ గ్రామానికి చెందిన మంగళి వెంకటయ్య పని నిమిత్తం మండల కేంద్రానికి తన ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో దుద్యాల్ సమీపంలో ఉన్న గోపన్ చెరువు కట్టపై ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి కింద పడ్డాడు. ఒక్కసారిగా చెరు వు కట్టలోకి దూసుకెళ్లడంతో గాయాలయ్యా యి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం స్థానికంగా ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చెరువు కట్ట కిందకు దూసుకుపోయిన వాహనాన్ని స్థానికులు శ్రమించి బయటకు తీశారు. అలాగే కట్టపై ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

చేవెళ్ల: పేకాట ఆడుతున్న ఏడుగురిని ఎస్ఓటీ పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుండాల గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ తేజశ్రీ తెలిపిన వివరాల ప్రకారం.. గుండాలలోని వ్యవసాయ పొలం వద్ద ఉన్న షెడ్‌లో కొంత మంది పేకాట ఆడుతున్నట్లుగా రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులకు సమాచారం అందటంతో దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.37,990 నగదు, 7 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.

క్వారీ గుంతలో పడి యువకుడి మృతి..

కుత్బుల్లాపూర్: క్వారీ గుంతలో పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదివారం కొంపల్లి జయభేరి పార్కు ప్రాంతంలోని క్వారీ గుంతలో ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడిని హస్మత్‌పేట్‌కు చెందిన మహ్మద్ షాహిద్(17)గా గుర్తించారు. ప్రమాదవశాత్తు క్వారీ గుంతలో పడి మృతి చెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం..

సనత్‌నగర్: బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలంరాయిలో ఫుట్‌పాత్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాలంరాయిలోని పబ్లిక్ టాయిలెట్స్ వద్ద ఫుట్‌పాత్‌పై సుమారు 25–30 ఏళ్ల వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నట్లు ఉమేష్ అనే వ్యక్తి డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పెట్రోలింగ్ సిబ్బంది 108 సిబ్బందితో కలిసి అతడిని పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. అయితే మృతుని వివరాలు తెలియరాలేదు. సంబంధీకులు ఎవరైనా బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం రాత్రి ఘట్‌కేసర్–బీబీనగర్ రైల్వేస్టేషన్‌ల మధ్య చోటు చేసుకుంది. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణసింగ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రైలు పట్టాల మధ్య గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్థలానికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురెళ్లి సదరు వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడి ఒంటిపై స్కై బ్లూ కలర్ చొక్కా, అదేరంగు ప్యాంటు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

యువ సాఫ్ట్‌వేర్ మృతి



రవికుమార్(ఫైల్)

కొత్తూరు: గుండె నొప్పితో ఓ యువ సాఫ్ట్‌వేర్ మృతి చెందాడు. ఈ ఘటన కొత్తూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మహబూబ్ నగర్ జిల్లా భూత్పూర్ మండలం అన్నాసాగర్‌కు చెందిన రవికుమార్(31) ఎనిమిదేళ్ల క్రితం పారిస్ వెళ్లి అక్కడ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేశాడు. ఏడాది క్రితం స్వగ్రామానికి వచ్చి సొంతంగా వ్యాపారం ప్రారంభించేందుకు తరచూ గ్రామం నుంచి హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తున్నాడు. శనివారం రాత్రి హైదరాబాద్ నుంచి వస్తుండగా మార్గమధ్యలో ముగ్గురికి లిఫ్ట్ ఇచ్చాడు. కొత్తూరు సమీపంలోకి రాగానే ఛాతిలో నొప్పి రావడంతో కారు అదుపుతప్పింది. కారులో ఉన్నవారు గమనించి ఆయన్ను వెంటనే స్థానికంగా ఉన్న లీమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాద్ తరలించాలని సూచించారు. అంబులెన్స్ వచ్చేలోగా ఆయన తుదిశ్వాస విడిచాడు. మృతుడికి ఏడు నెలల క్రితం వివాహమవ్వగా ప్రస్తుతం ఆమె ఐదు నెలల గర్భిణి. మృతుడి తమ్ముడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మరొకరికి గాయాలు



వంశీ (ఫైల్)



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

హస్తినాపురం: వేగంగా వెళుతున్న డీసీఎం వ్యాన్ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనక వచ్చిన ద్విచక్రవాహనం అదుపుతప్పి డీసీఎంను ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు గాయపడిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వనస్థలిపురం పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా, ఆరుట్ల గ్రామానికి చెందిన చీమర్ల వంశీ(20)తన స్నేహితుడు ప్రవీణ్‌తో కలిసి ఆదివారం తెల్లవారుజామున ఎఫ్‌జెడ్ బైక్‌పై ఇబ్రహీంపట్నం నుంచి బీఎన్‌రెడ్డినగర్‌కు వచ్చారు. వారు టిఫిన్ చేసి ఇబ్రహీంపట్నం వైపు వెళుతుండగా లైఫ్‌కేర్ ఆసుపత్రి ఎదుట అతివేగంగా వస్తున్న డీసీఎం వ్యాన్ డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేకు వేయడంతో వెనక వస్తున్న బైక్ అదుపుతప్పి డీసీఎంను ఢీకొట్టింది. ఈ ఘటనలో వంశీ తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెనక కూర్చున్న ప్రవీణ్‌కు గాయాలు కావడంతో సమీపంలోని లైఫ్‌కేర్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న వనస్థలిపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వంశీ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలిచారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విసర్జన్..ఆన్‌లైన్!

ప్రతి గణేశ్ విగ్రహానికీ క్యూఆర్ కోడ్

- జియో ట్యాగింగ్ చేస్తున్న సిటీ పోలీసులు
- తనిఖీల నిర్వహణపై అధికారుల కన్ను
- నిమజ్జనం నేపథ్యంలోనూ పని సరళం





సాక్షి, సిటీబ్యూరో: సిటీలో ఏటా జరిగే గణేశ్ నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జనం నగర పోలీసులకు అత్యంత కీలకమైన ఘట్టాలు. మండపం ఏర్పాటుకు అనుమతి మంజూరు చేయడం నుంచి విగ్రహం నిమజ్జనం(విసర్జన్) అయ్యే వరకు నిత్యం అప్రమత్తంగా ఉండాల్సిందే. గతంలో మాన్యువల్ జరిగే ఈ తంతును సిటీ కాప్స్ పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ చేశారు. ప్రతి వినాయక మండపానికీ ఓ ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్ కేటాయించారు. దీంతో తనిఖీల నుంచి నిమజ్జనం వరకు ప్రతి అంశం జవాబుదారీగా ఉండనుంది. నగరంలోని విగ్రహాలన్నింటినీ జియో ట్యాగ్ చేశారు.

రిజిస్ట్రేషన్ ఉన్నా లేకున్నా ఒకేలా..

నగర పోలీసు కమిషనరేట్ పరిధిలో ఏటా వేల వినాయక మండపాలు ఏర్పాటవుతుంటాయి. దీనికోసం నిర్దేశిత సమయం ముందు నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుంది. వీటి ఆధారంగా పోలీసులు మండపాల ఏర్పాటుకు అనుమతి ఇవ్వడంతో పాటు ప్రతి దానికీ ఓ నంబర్ కేటాయిస్తుంటారు. ఇలా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే వాటి కంటే రెట్టింపు సంఖ్యలో విగ్రహాలు ఏర్పాటవుతుంటాయి. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి అధికారులు తమ పరిధిలో ఏర్పాటైన మండపాలు రిజిస్ట్రేషన్ చేసుకున్నా లేకపోయినా సదరు విగ్రహాన్ని పరిగణలోకి తీసుకుని చర్యలు తీసుకుంటున్నారు. అది నిమజ్జనం అయ్యే వరకు పర్యవేక్షణకు ఏర్పాట్లు చేశారు. దీనికోసం ప్రతి విగ్రహానికి ఓ క్యూఆర్ కోడ్ కేటాయిస్తున్నారు. దీన్ని నిర్వాహకులు తమ మండపాల్లో నిర్దేశిత ప్రాంతంలో అతికిస్తున్నారు.

అధికారిక యాప్‌లోనూ లింకు..

ఈ క్యూఆర్ కోడ్స్ ఆధారంగా ఆయా విగ్రహాలను జియో ట్యాగింగ్ చేస్తున్నారు. ఆ డేటాను పోలీసు అధికారిక యాప్ టీఎస్ కాప్‌లోకి లింకు ద్వారా ఇస్తున్నారు. దీంతో ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయిలో ఉండే పోలీసుల వరకు ఎవరైనా సరే తమ ప్రాంతంలో ఎన్ని మండపాలు ఉన్నాయి? ఎక్కడ ఉన్నాయి? ఎప్పుడు ఏర్పాటు అవుతాయి? నిమజ్జనం ఎప్పుడు? ఏ మార్గంలో వెళ్లి, ఎక్కడ నిమజ్జనం చేస్తారు? తదితర వివరాలను తమ ట్యాబ్స్, స్మార్ట్‌ఫోన్స్‌లో చూసుకునే అవకాశం ఏర్పడింది. క్యూఆర్ కోడ్ కేటాయింపులోనే అధికారులు పక్కాగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల వారీగా వేర్వేరుగా దీని కేటాయింపు జరుగుతోంది.

కోడ్ స్కానింగ్‌తో తనిఖీలు

ఓ ప్రాంతంలో మండపం ఏర్పాటయినప్పటి నుంచి అందులోని విగ్రహం నిమజ్జనం అయ్యే వరకు ప్రతి దశలోనూ పోలీసుల పర్యవేక్షణ ఉంటుంది. గస్తీ విధులు నిర్వర్తించే బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ వాహనాల సిబ్బంది నిత్యం ఆయా మండపాల వద్దకు వెళ్లి పరిస్థితుల్ని అంచనా వేయడంతో పాటు తనిఖీలు చేపడుతున్నారు. విగ్రహాలకు క్యూఆర్ కోడ్ కేటాయిస్తున్న నేపథ్యంలో గస్తీ సిబ్బంది తనిఖీ సందర్భంలో తమ ట్యాబ్స్ వినియోగించి మండపాల వద్దకు కోడ్‌ను స్కాన్ చేస్తున్నారు. దీంతో ఈ తనిఖీలు ఎలా సాగుతున్నాయన్నది ఉన్నతాధికారులకు ఈ యాప్ ద్వారానే తెలుస్తుంది.

నిమజ్జనం సమయంలో స్పష్టత..

నిమజ్జనం రోజు ఊరేగింపు మార్గాల పర్యవేక్షణ, విగ్రహాలు ఏ మార్గాల్లో ఎన్ని ఉన్నాయనేది తెలుసుకోవడానికీ విగ్రహాల జియో ట్యాగింగ్ ఉపకరించనుంది. గణేష్ ఉత్సవాల్లో నిమజ్జనం అత్యంత కీలకమైన ఘట్టం. నిర్దేశిత సమయంలో ఊరేగింపు ప్రారంభం కావడం నుంచి నిమజ్జనం పూర్తయ్యే వరకు ప్రతి విగ్రహం కదలికల్నీ గమనిస్తుండాలి. క్యూఆర్ కోడ్‌తో కూడిన పత్రంతో వచ్చే విగ్రహాలను క్షేత్రస్థాయి సిబ్బంది ఎక్కడికక్కడ పర్యవేక్షిస్తారు. ఆ కోడ్‌ను తమ ట్యాబ్స్, ఫోన్లలో స్కానింగ్ చేస్తుంటారు. దీంతో ఏ విగ్రహం, ఏ సమయంలో, ఏ ప్రాంతంలో ఉంది? ఎప్పుడు నిమజ్జనం జరిగింది? ఇంకా ఎన్ని విగ్రహాలు నిమజ్జనం కావాల్సి ఉంది? అనే అంశాలు యాప్ ద్వారా సిబ్బంది, అధికారులకు తెలుస్తుంటాయి.